## ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

**ఎస్పీ కోటిరెడ్డి**

**వికారాబాద్ పట్టణంలో ఫ్లాగ్ మార్చ్**



పట్టణంలో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, అక్టోబర్ 26 : శాంతియుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడానికి ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. గురువారం వికారాబాద్ పట్టణంలోని కేంద్ర సాయుధ బలగాలతో పాటు ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, పోలీస్ అధికారులు ఎన్టీఆర్ చౌరస్తా నుంచి బీజేఆర్, మహాశక్తి చౌరస్తా, బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్ల మీదుగా ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ జిల్లా పోలీసులు శాంతిభద్రతలను రక్షిస్తూ ప్రజలందరికీ భరోసాను ఇస్తూ ధైర్యాన్ని కల్పిస్తామన్నారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్, వికారాబాద్ డీఎస్పీ నర్సింహులు, టీడీసీ డీఎస్పీ విజయ్, ఏఆర్‌డీఎస్పీ వీరేశ్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డీవీపీ రాజు, పట్టణ సీఐ శ్రీను, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, సీఐలు, ఎస్సైలు, సశస్త్ర సీమా బల్ అసిస్టెంట్ కమాండర్ పవన్‌పహన్ పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

**ఏఎస్సై చారి**

**వాహనదారులు, ప్రజలకు అవగాహన కల్పించిన పోలీసు సిబ్బంది**

దోమ, అక్టోబర్ 26: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి సురక్షితమైన ప్రయాణం కొనసాగించాలని ఏఎస్సై చారి అన్నారు. శనివారం దోమ మండల కేంద్రంలోని హనుమాన్ చౌరస్తాలో ఏఎస్సై చారి పోలీసు సిబ్బందితో కలిసి వాహనదారులు, ప్రజలకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, కార్లలో వెళ్లేవారు విధిగా సీటు బెల్టు ధరించి వాహనం నడుపాలని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి నడిపేందుకు ప్రోత్సహిస్తే తల్లిదండ్రులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలపై పరిమితికి మించి ట్రిపుల్ రైడింగ్ చేస్తే అట్టి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని సూచించారు. వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ క్షేమంగా ఇండ్లకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది నారాయణరెడ్డి, శ్రీనివాస్, వాహనదారులు, ప్రజలు పాల్గొన్నారు.



దోమలో వాహనదారులకు రోడ్డు భద్రతా నిబంధనలు వివరిస్తున్న పోలీసులు

## కల్లు, మద్యం కేంద్రాలపై దాడులు

**ఆరుగురిపై కేసులు నమోదు**



అక్రమ కల్లు నిల్వలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

వికారాబాద్, అక్టోబర్ 26 : అక్రమంగా కల్లు, మద్యం నిలువలు, అమ్మకాలపై ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసినట్లు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్‌కుమార్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లాలో ఎక్సైజ్ అధికారులతో కలిసి విస్తృతంగా తనిఖీలు చేసి అక్రమ మద్యం, కల్లు నిల్వలు, అమ్మకాలు జరిపిన ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో 1766 లీటర్ల కల్లును ధ్వంసం చేశామన్నారు. మద్యం సరఫరాలో మొత్తం 111 లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు

**సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పదాలు వాడకూడదు**

**ఎస్ఐ రమేశ్‌కుమార్**

దౌల్తాబాద్, అక్టోబర్ 26: ఎన్నికల కోడ్ ఉల్లంఘించి వాట్సప్ మాధ్యమం ద్వారా అంబేద్కర్ సంఘం పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేశ్‌కుమార్ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 23న ఉదయం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన మధు అనే వ్యక్తి వాట్సప్ మాధ్యమం ద్వారా శివాజీ అంబేద్కర్ భావజాలంపై పోరాటాలు చేస్తున్నవారిపై అనుచిత వ్యాఖ్యలు, బూతుమాటలు తిట్టాడని ఈ రెండు గ్రూపుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేవిధంగా ఉండడంతో అతడిపై చట్ట ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. గ్రామంలో కొంత మందికి వ్యక్తిగతంగా ఈర్ష్యలు ఉండటం వల్ల రేవంత్ మిత్రమండలి ఆర్ఎంఎం అనే వాట్సప్ గ్రూప్‌లో ఒక పార్టీ లీడర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన నలుగురిపై గత వారం రోజుల క్రితం కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. గ్రామస్తులు అర్థం చేసుకుని ఎన్నికల కోడ్ నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. కుల, మత, జాతి విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా పోస్టులు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## పాఠశాల బస్సు ఢీకొని మహిళ మృతి

కంటోన్మెంట్, అక్టోబర్ 26: పాఠశాల బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ మరణించింది. కార్ఖానా పోలీసుల కథనం ప్రకారం.. బోయిన్‌పల్లి హస్మత్‌పేటకు చెందిన జ్యోతి(42) మనోవికాస్‌నగర్‌లోని పల్లవి మోడల్ స్కూల్లో ఆయాగా పనిచేస్తున్నది. దసరా సెలవులు ముగియడంతో గురువారం పాఠశాల ప్రారంభమైంది. జ్యోతి కూడా గురువారం ఉదయం పాఠశాలకు వచ్చింది. పాఠశాలకు సంబంధించి బస్సులో ఆయాగా పనిచేస్తున్న ఆమె.. గురువారం ఉదయం పాఠశాలలో ఉన్న బస్సు పాయింట్ వద్దకు వచ్చి నిలబడింది. ఉదయం 6.30 గంటల సమయంలో అదే పాఠశాలకు చెందిన ఓ బస్సు వేగంగా వచ్చి.. బస్సు పాయింట్ వద్ద నిలబడి ఉన్న జ్యోతిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

**మృతురాలి బంధువుల ఆగ్రహం..**

ఈ ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌కు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ లేదని, లర్నింగ్ మాత్రమే ఉన్నదని తెలియడంతో మృతురాలి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లర్నింగ్ లైసెన్స్ ఉన్న వ్యక్తిని పాఠశాల బస్సును నడిపించేందుకు ఎలా అనుమతించారని మండిపడ్డారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వారు ఆరోపించారు. ఈ ఘటనపై స్థానిక ఎమ్మార్పీఎస్ నేతలు ఆందోళన చేశారు. మృతురాలి బంధువులకు పాఠశాల యాజమాన్యం రూ. ఐదు లక్షల చెక్కును అందజేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై పూర్తి విచారణ జరిపి డ్రైవర్, పాఠశాల నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు.

## నవంబర్ 14 వరకు ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు

**ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా నోడల్ అధికారి శంకర్**

వికారాబాద్, అక్టోబర్ 26 : ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు మార్చి 2024లో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు రాసేందుకు తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలను ప్రకటించిందని ఇంటర్ బోర్డు జిల్లా నోడల్ అధికారి శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి నవంబర్ 14 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. నవంబర్ 16 నుంచి 23 వరకు రూ.500 అపరాధ రుసుముతో చెల్లించాలన్నారు. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 4 వరకు రూ.1000 అపరాధ రుసుముతో చెల్లించాలన్నారు. డిసెంబర్ 6 నుంచి 13 వరకు రూ.2వేల అపరాధ రుసుముతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు చదువుకున్న కళాశాలల్లో చెల్లించవచ్చని, ఇతర వివరాలకు వారు చదువుతున్న కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని కోరారు.

## దామగుండం అడవిలో చిరుత సంచారం

**భయాందోళనకు గురవుతున్న స్థానికులు**



పూడూరు, అక్టోబర్ 26: దామగుండం అడవిలో చిరుతపులి సంచరిస్తూ ఓ లేగదూడను చంపి తిన్న ఘటన వెలుగులోకి వచ్చింది. పూడూరు మండల కేంద్రం సమీపంలోని దామగుండం అడవిలో మూడు రోజుల క్రితం పూడూరు గ్రామానికి చెందిన శ్రీశైలం అనే రైతుకు చెందిన లేగదూడను గుర్తు తెలియని జంతువు లేగదూడను చంపితిన్నదని, ఈ విషయం అటవీ శాఖ అధికారులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో లేగదూడ మృతి చెందిన ప్రాంతంలో సీసీ కెమెరాలను అధికారులు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి చనిపోయిన లేగదూడ వద్దకు చిరుతపులి వచ్చినట్లు సీసీ కెమెరా రికార్డులో దృశ్యాలను గుర్తించినట్లు వికారాబాద్ డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. ఈ చిరుతపులి మందాబాద్ అటవీ ప్రాంతం నుంచి వచ్చి ఉండవచ్చని తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, రైతులు అడవిలోకి ఒంటరిగా వెళ్లకూడదని సూచించారు. ఘటనా స్థలాన్ని అటవీ శాఖ అధికారులు ఎఫ్ఆర్‌వో అరుణ, ఎఫ్ఎస్‌వో అరుణలు సిబ్బందితో వెళ్లి పరిశీలించారు.

## రూ. 10 లక్షల హవాలా డబ్బు పట్టివేత

సిటీబ్యూరో, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): హవాలా మార్గంలో నగదును తరలిస్తున్న ఇద్దరిని సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి, వారి వద్దనుంచి రూ.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అంబర్‌పేటకు చెందిన మన్‌ప్రీత్ సింగ్ తుక్కు వ్యాపారి. అతడి వద్ద షేక్ అర్షద్ పనిచేస్తున్నాడు. ఇద్దరు కలిసి మెట్రోపాలిటన్ నగరాల్లో హవాలా నగదును తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై రూ.10 లక్షల నగదు తరలిస్తుండగా.. సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజానాయక్ బృందం అబిడ్స్‌లో పట్టుకున్నది. వారి వద్ద నుంచి రూ. 10 లక్షల నగదు, ఒక బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

### తనిఖీల్లో రూ.13.07 లక్షల నగదు సీజ్

సిటీబ్యూరో, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): శాసనసభ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలో భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో తొమ్మిది మంది సిబ్బందితో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టింది. భారీ స్థాయిలో నగదు, అక్రమ మద్యం పట్టుకుంటున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా గురువారం రూ.13,07,990 నగదును సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. ఇప్పటి వరకు రూ.1,64,09,790 నగదును సీజ్ చేసినట్లు చెప్పారు. 350 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని తెలిపారు. ఎక్సైజ్ శాఖ ద్వారా 193 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేసినట్టు వివరించారు.

## డ్రగ్ దందా.. ముగ్గురు స్నేహితులు అరెస్టు

సిటీబ్యూరో, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): రెండేండ్లుగా డ్రగ్స్ దందా చేస్తున్న ముగ్గురు స్నేహితులను తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో(టీనాబ్), డబీర్‌పురా పోలీసులు కలిసి అరెస్టు చేశారు. టీనాబ్ ఎస్పీ చక్రవర్తి గుమ్మి కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడకు చెందిన మిర్జా అఫ్సర్ అలీబేగ్, మహ్మద్ సాజిద్, సైదాబాద్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ సలాం ఖాన్ స్నేహితులు. రెండేండ్లుగా ఎండీఎంఏ డ్రగ్స్‌ను వివిధ మార్గాల్లో తక్కువ ధరకు కొని, నగరంలోని పలు ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తూ డ్రగ్స్ దందా చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు టీనాబ్ ఇన్‌స్పెక్టర్లు డానియెల్, సంతోష్‌కుమార్ బృందం డబీర్‌పురా డీఐ ప్రభాకర్ బృందంతో కలిసి ఈ ముగ్గురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 12 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.




## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి దారుణ హత్య

**డాగ్‌స్క్వాడ్‌తో వివరాలు సేకరిస్తున్న పోలీసులు**

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ మహేశ్**

గండీడ్, అక్టోబర్ 26 : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన మండల పరిధిలోని మన్సూర్‌పల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మన్సూర్‌పల్లి గ్రామానికి చెందిన గోవిందు (45) హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దసర పండగకు సొంత గ్రామమైన మన్సూర్‌పల్లికి వచ్చాడు. పొలం వద్ద పంట చేనును అడవి పందులు ధ్వంసం చేస్తున్నాయని, పంట కాపలా కోసం బుధవారం రాత్రి పొలం వద్దకు వెళ్లి పడుకోగా, గుర్తు తెలియని వ్యక్తులు పదునైన ఆయుధాలతో అతడిపై దాడికి పాల్పడడంతో రక్తం మడుగులో మృతిచెంది ఉన్నట్లు ఉదయం పొలానికి వెళ్లిన కుమారుడు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకొని డాగ్ స్క్వాడ్‌తో వివరాలు సేకరించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

**ఘటనాస్థలానికి డీఎస్పీ మహేశ్..**

హత్యకు గురైన వ్యక్తి వివరాలు సేకరించేందుకు జిల్లా డీఎస్పీ మహేశ్ ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. మరిన్ని వివరాలు సేకరించి హంతకులను త్వరలో పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు. సీఐ ప్రవీణ్‌కుమార్ పోలీసు బృందం ఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.